"హెచ్చెం సారు మిమ్ముల రమ్మంటున్రు సార్"

పోచయ్య అలసటతో రొప్పుతున్నాడు. అలా రొప్పుతూనే అదే విషయం రెండుసార్లు అప్పగించినట్లుగా వల్లించాడు వాడు.

శంకరయ్య సారు ఎందుకో విసుక్కున్నారు. 'ప్చ్ ఈ హెచ్.యమ్. వీరయ్యగారిది అదో గోల. అయిందానికి కానిదానికి పిలిపించడమే. ఏదో మేనేజ్ చేసుకోవచ్చుగదా. ప్రతిదానికి స్టాఫ్ మీటింగులూ, పేరెంటు కమిటీ మీటింగులూ, చర్చలూ, సంతకాలు, తీర్మానాలూ, ఫైళ్ళూ వీటిని మెయిన్‌టైన్ చేయడంలో మాత్రం దిట్ట. వీరి మినిట్స్ బుక్ చూస్తేనా! ఇప్పటికే ఈ బడీ, పిల్లలూ అన్ని హంగుల్తో సర్వాంగ శోభితంగా అలరారుతున్నట్టే కన్పిస్తుంది. కాని ఎక్కడవేసిన గొంగడి అక్కడే. అవసరమైనచోటే వీరి నోరు మూతపడి మాట పెగలదు. ఒక్కపనీ స్వంతంగా చేయడం చేతగాదు. వచ్చేవాడు తానొక్కడు చావడే. ప్రతి దానికి ఎవర్నో ఒకర్ని పక్కన వేసుకుని చావాలని చూస్తాడు. ఛ, ఛ, భలే హెడ్మాష్టరు దొరికాడు తమ ఖర్మానికి!

అలా విసుక్కుంటూనే టీ సిప్ చేస్తున్నారు శంకరయ్య సారు. పిల్లవాడు సారుకేసి ఎంతో వింతగా ఆసక్తిగా చూస్తున్నాడు. అదేదో వింతపక్షి అంతకు క్షణం క్రితం చూసింది అచ్చం యిలాగే తాగేదన్నట్టు సారుకేసి ఆ టీ తాగడం కేసి అదే పనిగా చూస్తున్నాడు. అది గమనించిన సారుకి మరింత చిర్రెత్తుకొచ్చినట్టుంది.

"వస్తున్నా పదరా!"

వాడు మేష్టారికన్నా తెలివైన పిల్లవాడిలా ఉన్నాడు. అక్కణ్నించి కదలలేదు. "లేద్సార్, ఉత్తగవోతె నన్ను మల్లా యిట్లనే పురికిస్తడు సార్."

"ఆహా! గురువుకు తగ్గ శిష్యులు దొరికారురా!" అని తనలో తానే నవ్వుకుంటూ విసుక్కున్నారు శంకరయ్య. ఓ సిగరెట్ నోట కరుచుకొని 'పద' అంటూ దారితీశారు.

సారుని చూసి కొందరు పిల్లలు పక్కకు తప్పుకున్నారు. కొందరు గౌరవంతో చూస్తున్నారు. "సారు పక్కన నడుస్తున్నా! చూడండి మన గొప్ప" అన్నట్టు ఛాతీ ఉబ్బించి ఉత్సాహంగా అడుగులు వేస్తున్నాడు పోచయ్య.

గ్రౌండ్ నిండా పిల్లలే. నవ్వులు, కేరింతలు. పరుగులు. బాల్యాన్నంతా

